Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 84 | Friday 28.02.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 84 | శుక్రవారం 28. 02. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

## భవన నిర్మాణ ప్రణాళిక మంజూరు సమయంలోనే...

# అండర్ టేకింగ్ తీసుకోవాలి

### అక్రమ నిర్మాణాలకు చెక్... ఏపీ ప్రభుత్వ కీలక మార్గదర్శకాలు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** ఏపీలో అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలక శాఖ ఇవాళ(గురువారం) కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలతో మార్గదర్శకాలు జారీ చేసినట్లు ప్రకటించారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలని సూచనలు చేశారు. భవన నిర్మాణ ప్రణాళిక మంజూరు సమయంలోనే అండర్ టేకింగ్ తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ప్లాన్ మేరకు నిర్మాణం లేకపోతే నివాసయోగ్య ధ్రువపత్రం జారీ చేయకూడదని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ స్పష్టపరిచారు. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని చెప్పారు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు ఉంటాయని అన్నారు. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు జారీ మిగతా 2 లో




## పోలీసుస్టేషన్‌లో...

# పోసాని కృష్ణ మురళీ



హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రచయిత, సినీ నటుడు పోసాని కృష్ణ మురళీ ని పోలీసులుకాసేపట్లో అన్నమయ్య జిల్లా , ఓబులవారిపల్లెలో పోలీస్ స్టేషన్ కు తీసుకువెళతారు. బుధవారం రాత్రి హైదరాబాద్ లో మైహెూం భూజా అపార్టుమెంట్లో ఉన్న పోసానికి నోటీసులు ఇచ్చి అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం ఓబులవారిపల్లె పీఎస్‌కు తరలించారు. వైసీపీ అధికారంలో ఉండగా టీడీపీ , జనసేన అగ్రనేతలపై అడ్డూ అదుపు లేకుండా నోరు పారేసుకున్న పోసానిని పోలీసులు అరెస్టు చేశారు. ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఆతనిని అదుపులోకి తీసుకున్నారు.

**అర్థమైందా రాజా... :**

కాగా పోసాని కృష్ణ మురళీని ఓబులవారిపల్లెలో పోలీస్ స్టేషన్‌లో హాజరుపరిచిన తర్వాత అతనికి వైద్య పరీక్షల నిమిత్తం మిగతా 2 లో

## పోసాని అండగా...

# ఉంటాం : జగన్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ప్రముఖ సినీ నటు డు పోసాని కృష్ణమురళిని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లో నిన్న రాత్రి అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ అరెస్టుపై జగన్ స్పందించారు. పోసాని భార్య కుసుమలత ను గురువారం ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తుందని, ప్రజలు, దేవుడు అంతా చూస్తున్నారని అన్నారు. పోసానికి అండగా ఉంటామని, పార్టీ తరుఫున న్యాయ సహాయం అందిస్తామని వివరించారు. ఇప్పటికే సీనియర్ న్యాయవాదులకు బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కష్టకాలంలో మిగతా 2 లో

## ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం...

# దిగ్విజయమైంది..

### అసౌకర్యానికి గురైఉంటే క్షమించండి : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కోట్లాది మంది భక్తుల విశ్వాసం, అఖాడాల ఆశీర్వాదాలతో హిందువులు పవిత్రంగా భావించే ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళా శివరాత్రి పర్వదినమైన బుధవారం వైభవంగా ముగిసింది. ప్రజల భక్తి, ఐక్యత, సామరస్యాల సంగమంగా నిలిచిన ఈ వేడుకకు త్రివేణి సంగమం సాక్షిగా నిలిచింది. 45 రోజులపాటు జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్మాత్మిక వేడుకలో దాదాపు 66 కోట్ల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఈ మహాకుంభమేళాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాజాగా స్పందించారు. ఐక్యత కోసం జరిగిన ఈ మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసిందన్నారు. భారతీయ ఐక్యతకు ఈ కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించినట్లు చెప్పారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలూ లేకుండా విజయవంతంగా నిర్వహించడం అంత సులువు మిగతా 2 లో

## లోకేశ్ సమక్షంలో స్కిల్‌బీ...

# అవగాహన ఒప్పందం

### స్కిల్‌బీ ద్వారా నర్సింగ్ స్టూడెంట్స్ కు జర్మన్ భాషలో శిక్షణ
### ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగాలు
### బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం విద్యనభ్యసించే విద్యార్థినులకు జర్మనీ, ఐరోపా దేశాల్లో ఉద్యోగావకాశాలు లభించేలా శిక్షణ ఇప్పించేందుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ మిగతా 2 లో



## హెలికాప్టర్ నుంచి చూస్తే.. సొరంగం ఏమన్న...

# కనిపిస్తదా..?

### మంత్రులను ప్రశ్నించిన హరీశ్‌రావు

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. దాదాపు ఐదు రోజులు పూర్తవుతున్నప్పటికీ సహాయక చర్యలు కనీసం ప్రారంభం కాలేదు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయింది. కేంద్ర ప్రభుత్వ బృందాలు, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం మిగతా 2 లో





## అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ...

# క్షమించం : మంత్రి

### చట్టబద్ధంగానే వైసీపీ నేత పోసాని కృష్ణమురళీ అరెస్ట్: మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణాజిల్లా, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆడబిడ్డలపై సోషల్ మీడియా లో అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ క్షమించమని.. ఆడబిడ్డల సంరక్షణ, సమాజ శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. సినీ రచయిత, నటుడు, వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళీ అరెస్టు పై స్పందించిన ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడు తూ.. చట్టబద్ధంగానే పోసాని అరెస్ట్ జరిగిందని, గతంలో ఆయన మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలు ఎవరూ మరచిపోరని అన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చిన మిగతా 2 లో

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని...

# జాగ్రత్తగా వాడుకోవాలి

### తాగునీటికి మొదటి ప్రాధాన్యతను ఇస్తూ పంటలను దృష్టిలో పెట్టుకోవాలని సూచన
### వినియోగ మట్టానికి 60 టీఎంసీలకు పైగా నీరు ఉందని వెల్లడి
### ఉన్న కొద్ది నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచన

### : ఏపీ, తెలంగాణలకు కేఆర్ఎంబీ




శ్రీశైలం , **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని ఉభయ తెలుగు రాష్ట్రాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, మిగతా 2 లో

# సంపాదకీయం

## 45 రోజులు వేడుకలు? 66 కోట్ల పుణ్యస్నానాలు

భారత ఆధ్యాత్మిక ప్రగతికి నిదర్శనమైన కుంభమేళకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి కోట్ల మంది భక్తులు పోటెత్తారు. ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమంలో 45 రోజుల పాటు సాగిన వేడుకలు.. ఆద్యంతం ఆధ్యాత్మికత, భక్తిపారవశ్యంతో నిండిపోయాయి. కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించిన 'మహా కుంభమేళా' పరిసమాప్తం అయ్యింది. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ విశిష్ఠ కుంభమేళా జనవరి 13న ఆరంభమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద జన జాతరగా భావిస్తున్న ఈ మహా స్నానఘట్టం మహా శివరాత్రితో ముగిసిపోయింది. చివరి రోజున అమృత స్నానం ఆచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఉదయం 5.30 గంటల నుంచే స్నాన ఘాట్టాలు భక్తులతో కిక్కిరిసిపోయారు. చివరి రోజున సుమారు 1.5 కోట్లకు పైగా భక్తులు అమృతస్నానం ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. దీంతో, మహా కుంభమేళా స్నానాలు ఆచరించిన మొత్తం భక్తుల సంఖ్య 66 కోట్లు దాటినట్లు ప్రభుత్వం ప్రకటించింది. భక్తుల సంఖ్యలో అనుకున్న స్థాయికి మించి పెరుగుదల నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. చైనా, భారత్ మినహా ఇతర అన్ని దేశాల జనాభా కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు స్నానమాచరించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన వారు కూడా ఈ మహా క్రతువులో పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 'ఎయిర్‌షో' నిర్వహించింది. మహా కుంభమేళా క్షేత్ర గగనతలంలో ఈ ప్రత్యేక ఎయిర్‌షో ఆకట్టుకుంది. చివరి రోజున ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశారు. అదనపు బలగాలను మోహరించారు. మహా కుంభమేళా-2025లో ఎంతో మంది సామాన్య వ్యక్తులు సెలబ్రిటీలుగా మారారు. వారిలో ప్రముఖులైన వారిలో మధ్యప్రదేశ్‌కు చెందిన 16 ఏళ్ల మోనాలీసా మొదటి స్థానంలో ఉంటారు. ఈమె పూసలు విక్రయించే ఆవిడ కాగా.. రాత్రికి రాత్రే సెలబ్రిటీగా మారిపోయింది. సోషల్ మీడియాలో ఆమె వీడియోలు ఇంకా వైరల్ అవుతూనే ఉన్నాయంటే ఆమెకు ఎంత క్రేజ్ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. కుంభమేళా ప్రాంగణంలో జనాలంతా ఆమెతో ఫోటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. అదృష్టం కొద్దీ మోనాలీసాను సినిమా ఛాన్స్ వరించింది. ఆ తర్వాత.. 'ఐఐటీ బాబా' గుర్తింపు తెచ్చుకున్న అభయ్ సింగ్ అనే బాబా కూడా ఫేమస్ అయ్యాడు. ఆయన ఐఐటీ బాంబే ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదివారు. ఆ తర్వాత బాబాగా మారిపోయారు. అందుకే, ఆయనకు ఐఐటీ బాబా అని పిలిచారు. మహా కుంభమేళాలో అమృత స్నానమైన 'మౌని అమావాస్య' సందర్భంగా జనవరి 29న ఘోర విషాదం చోటుచేసుకొంది. ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయండా రాత్రి సమయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రద్దీ నియంత్రణలో వైఫల్యం కారణంగా తొక్కిసలాట జరిగి ఏకంగా 30 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి 1.30గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనపై ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని నింపినప్పటికీ ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. మరోవైపు, మహా కుంభమేళాకు తరలి వెళ్లే భక్తుల రద్దీ కారణంగా ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో కూడా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏకంగా 18 మంది చనిపోయారు.మహా కుంభమేళాలో మొత్తం మూడు సార్లు అగ్నిప్రమాదాలు సంభవించాయి. కుంభమేళా-2025లో పేద వర్గాల నుంచి రాజకీయ, సినీ, వ్యాపార, ఇతర రంగాలకు చెందిన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కట్టుదిట్టమైన భద్రత నడుమ మహా కుంభమేళా స్నానం ఆచరించారు. క్షణం తీరిక లేకుండా గడిపే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 5న ప్రయాగ్‌రాజ్ వెళ్లి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. కోట్లాది మంది భక్తుల మాదిరిగానే తాను కూడా దైవాశ్వీరాదం పొందానని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచ కుభేరుల్లో ఒకరైన రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ, తన కుటుంబ సభ్యులతో కలిసి మహా కుంభమేళాలో స్నానమాచరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలి రాష్ట్రాల సీఎంలు, బీజేపీతో పాటు ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో మహా కుంభమేళాలో పాల్గొన్నారు.

## హెలికాప్టర్ నుంచి చూస్తే.. సొరంగం ఏమన్న...

లోపించింది. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనటువంటిది. క్షణం కూడా చాలా విలువైనటువంటిది. ఎంత తొందరగా సహాయక చర్యలు ప్రారంభించడం ద్వారా వాళ్ల ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి. లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సహాయక చర్యలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం దారుణం. ప్రమాదం జరగటం దురదృష్టకరం, ఇలాంటి పరిస్థితుల మధ్య ఘటన జరిగింది ఆ విషయాలన్నీ బయటికి రావాలి. జరిగిన సంఘటన తర్వాత ప్రభుత్వ స్పందన బాధాకరంగా ఉంది. రేవంత్ రెడ్డి హెలికాప్టర్ వేసుకొని ఎన్నికల ప్రచారానికి వెళ్లిండు. ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా రేవంత్ రెడ్డికి? కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారు. సహాయ చర్యలకు విఘాతం కల్పించవద్దు, ప్రభుత్వానికి సహకరించాలి, సమయమనం పాటించాలని గత నాలుగైదు రోజులుగా బిఆర్‌ఎస్ పార్టీ ఉంది. బాధ కలిగించే అంశం ఏమిటంటే ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఒక్కొక్కరు ఒక్కో మాట చెబుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనేక టీమ్‌లు వచ్చాయని అంటున్నారు, కానీ డైరెక్షన్ ఈ ప్రభుత్వం ఇవ్వాలి. కానీ అందులో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మేము సంయమనం పాటిస్తుంటే కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తం టన్నెల్ దగ్గర కూర్చొని బిఆర్‌ఎస్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి బిఆర్‌ఎస్ మీద బురద చల్లుతున్నాడు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి నీళ్లు, వాటరు అంటూ ఏవో ఏవో మాట్లాడుతున్నాడు. ఆయన గురించి మాట్లాడుడు దండగ. ముఖ్యమంత్రి మాటలకు ఉత్తమ్ మాటలకు పొంతన లేదు. బిఆర్‌ఎస్ ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్‌రావు మండిపడ్డారు

## భవన నిర్మాణ ప్రణాళిక...

చేయొద్దని ఆదేశాలు జారీ చేశారు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సూచించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ :**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి ఈరోజు ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో చంద్రబాబు, లోకేశ్ తమ ఓటు వేశారు. ఇక ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అయితే, వీరిలో కేఎస్ లక్ష్మణరావు (పీడీఎఫ్), ఆలపాటి రాజేంద్రప్రసాద్ (కూటమి) మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

## ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం...

కాదన్నారు. అన్నిటినీ దాటుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, ప్రజలకు ఈ సందర్భంగా ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని గంగా, యమునా, సరస్వతి మాతాలను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అంతేకాదు ఏర్పాట్ల విషయం లోపాలున్నా, భక్తులెవరైనా అసౌకర్యానికి గురైనా అందుకు క్షమించాలని ప్రధాని కోరారు. కాగా, జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు జరిగిన ఈ మేళాలో 66.21 కోట్ల మందికి పైగా పాల్గొని పుణ్య స్నానాలు చేశారు. ఇక ఆఖరి రోజు1.44 కోట్ల మందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ఇది రికార్డులకెక్కింది. దేశ, విదేశీ ప్రముఖులు ఈ కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఈ కుంభమేళాకు ప్రత్యక్షంగా హాజరు కాని భక్తులకు డిజిటల్ ఫొటో స్నానం చేయించడం విశేషం.

## పోలీసుస్టేషన్‌లో...

ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తారు. పరీక్షల అనంతరం రైల్వే కోడూరు కోర్టులో హాజరుపరుస్తారు. మండలి జనసేన నేత మణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోసానిని అరెస్టు చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కుటుంబాన్ని టార్గెట్ చేసి అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశారు. దానికి సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లో ప్రసారం అయ్యాయి. దీనిపై మణి ఓబులవారిపల్లె పీఎస్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోసానిపై ఏపీలో 11 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఆధారాలు సేకరించారు.

**రంగంలోకి అన్నమయ్య జిల్లా పోలీసులు :**

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో ఈనెల 24వ తేదీన మణి అనే జనసేన నాయకుడు పోసానిపై ఫిర్యాదు చేశారు. కులాల పేరుతో దూషించడం, ప్రజల్లో వర్గ విభేదాలు సృష్టించడం వంటి అభియోగాలతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 196, 353 (2), 111 రెడ్‌విత్ 3(5) కింద కేసు (క్రైమ్ నంబర్ 65/2025) నమోదు చేశారు. పోసాని మాట్లాడిన మాటల వీడియో, ఆడియో టేపులను పోలీసులు పరిశీలించారు. ఇదే కేసులో ఆయనను అరెస్టు చేశారు.

**పిచ్చి పిచ్చిగా రెచ్చిపోయి.. :**

వైసీపీ అధికారంలో ఉండగా... టీడీపీ, జనసేన అగ్రనేతలపై పిచ్చిపిచ్చిగా రెచ్చిపోయి, అడ్డూ అదుపూ లేకుండా నోరు పారేసుకున్న సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని మైహోం భూజా అపార్ట్‌మెంట్‌లో ఉన్న పోసాని కృష్ణ మురళి నివాసానికి వెళ్లి... నోటీసులు అందించి, అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె ఎస్‌ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నలుగురు పోలీసులు హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులను కలిసి... పోసాని కృష్ణ మురళిపై నమోదైన కేసు వివరాలను అందించారు. ఆయన అరెస్టుకు ఎస్కార్ట్ కల్పించాలని కోరారు. దీంతో... రాయదుర్గం ఠాణా నుంచి ఒక ఎస్‌ఐ, ఒక కానిస్టేబుల్ ఏపీ పోలీసులకు తోడుగా వెళ్లారు. రాత్రి 8.45 గంటల సమయంలో మైహోం భూజాలోని పోసాని నివాసానికి వెళ్లి, ఆయనను అరెస్టు చేశారు.

**పోలీసులతో వాగ్వాదం... :**

అరెస్టు సమయంలో పోసాని పోలీసులకు సహకరించకుండా వాగ్వాదానికి దిగారు. 'నోటీసులు తీసుకోను. అరెస్టు చేసుకోండి. ఆడవాళ్ల మీద రౌడీయిజం చేస్తారా?' అంటూ నోరు పారేసుకున్నారు. 'మీరెవరు? ఎలా మా ఇంటికి వస్తారు?' అని ప్రశ్నించడంతో... తాము అన్నమయ్య జిల్లా పోలీసులమని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అరెస్టు చేస్తున్నాం... సహకరించండి అని కోరారు. "ముందు నాకు నోటీసు ఇవ్వండి. నేను ఆస్పత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకుని... తర్వాత మీ దగ్గరికి వస్తాను" అని పోలీసులకు సూచించారు. అలా కుదరదని, అరెస్టుకు సహకరించకపోతే తమ డ్యూటీ తాము చేయాల్సి వస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. 'మా ఇంట్లోకి వచ్చి నన్నే కోఆపరేట్ చేయమంటారేంటి' అని పోసాని వారిని నిలదీశారు. కేసు నమోదైతే కశ్మీర్‌కైనా వెళ్లి అరెస్టు చేసే అధికారం ఉంటుందని సదరు అధికారి స్పష్టం చేశారు. 'నాకు ఆరోగ్యం బాగలేదు... ఆపరేషన్ చేయించుకున్నా. పేషంట్‌ను కూడా పట్టించుకోరా' అని మళ్లీ పోసాని ఆగ్రహించారు. పోసాని సతీమణికి నోటీసు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. 'సర్‌ను అరెస్టు చేస్తున్నాం, నోటీసు తీసుకోండి మేడమ్' అని కోరడంతో... 'తీసుకోవద్దు... తీసుకోవద్దు' అని పోసాని ఆమెను ఆదేశించారు. 'నోటీసు తీసుకోండి సార్' అని పోలీసు అధికారి పదేపదే కోరినా... 'నోటీసు తీసుకునేదిలేదు. అరెస్టు చేసుకోండి' అని విసురుగా బదులిచ్చారు. 'ఆడవాళ్ల మీద రౌడీయిజం చేయొద్దు' అని పోలీసులను హెచ్చరించారు. 'మేం రౌడీయిజం చేయడంలేదు. నోటీసు ఇస్తున్నాం' అని ఎస్‌ఐ బదులిచ్చారు. 'నేను మాత్రలు వేసుకోవాలి. అన్నం తింటా' అన్నారు. ఆయన వేసుకోవాల్సిన మందులు ఇవ్వాలని పోలీసులు సూచించగా... 'ఏ మాత్ర ఎప్పుడు వేసుకోవాలో ఆయనకు తెలియదు. అన్నీ నేనే ఇస్తా' అని ఆయన సతీమణి చెప్పారు. అన్ని విషయాలు తాము దగ్గరుండి జాగ్రత్తగా చూసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. ఆయన కొంత సమయం తీసుకుని దుస్తులు మార్చుకుని, పోలీసులతో వచ్చారు.

**సారీలు చెప్పుకొని... :**

కూటమి అధికారంలోకి వచ్చాక కూడా పోసాని తన తీరు మార్చుకోలేదు. టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుపై వ్యక్తిగత దూషణలు, అడ్డగోలు ఆరోపణలు చేశారు. దీనిపై అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత వరుస కేసులు, అరెస్టుల భయంతో పోసాని ఒక్కసారిగా తన స్వరం మార్చేశారు. అంతకుముందు వాడూ, వీడు అని విరుచుకుపడిన ఆయనే... 'గారు' అంటూ మర్యాద ఇచ్చారు. 'నేను రాజకీయాల నుంచి తప్పుకొంటున్నా. ఇక ఎవరి గురించీ మాట్లాడను' అని చేతులు పైకెత్తేశారు. 'రాజకీయ నాయకులందరికీ నమస్కరిస్తున్నాను. ఇన్నేళ్లు నన్ను ఆదరించారు. ఈ రోజు నుంచి నేను చనిపోయేదాకా నా బిడ్డలు, నా కుటుంబం కోసమే బతుకుతా. ఏ రాజకీయాల గురించీ మాట్లాడను' అని వినమ్రంగా తెలిపారు. కానీ... అప్పటికే ఆయనపై రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. సీఐడీకి కూడా ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపింది.

## లోకేశ్ సమక్షంలో స్కిల్‌బీ...

కార్పొరేషన్, స్కిల్‌బీ నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఇరుపక్షాలు ఎంఓయుపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... జర్మనీలో వృద్ధుల సంరక్షణ, ఆసుపత్రుల్లో 3 లక్షల మంది నర్సింగ్ అభ్యర్థుల కొరత ఉందని తెలిపారు. యూరప్ లో ముఖ్యంగా జర్మనీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు గాను రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన విద్యార్థినులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ వల్ల ప్రతి ఏటా వెయ్యి మంది నర్సింగ్ విద్యార్థినులకు జర్మనీలో అత్యుత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ వింజమూరి రవిచంద్ర గౌతమ్, సీఈఓ ఉజ్వల్ చౌహన్ మాట్లాడుతూ... తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 10వేల మందికిపైగా విదేశాల్లో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. స్కిల్‌బీ అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ స్టార్టప్‌లలో ఒకటిగా ఉందని తెలిపారు. జర్మనీ, పోలాండ్, హంగేరీ, లిథువేనియా, లాట్వియా, ఇతర తూర్పు ఐరోపా దేశాలకు తమ సంస్థ ద్వారా అభ్యర్థులను రిక్రూట్ చేస్తున్నామని అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యంతో బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం స్పెషలైజేషన్ తో గ్రాడ్యుయేషన్ పొందిన నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, ప్లేస్ మెంట్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. స్కిల్‌బీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఏపీఎస్ఎస్‌డీసీలు భాషా నైపుణ్య కొరతను పరిష్కరించి, ఏపీని నైపుణ్య రాజధానిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, విశాఖపట్నంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లోని 4వేల మందికి పైగా నర్సింగ్ విద్యార్థులకు స్కిల్‌బీ ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ట్రైనింగ్ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, ఏపీఎస్ఎస్‌డీసీ సీఈఓ గణేశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మనోహర్, మెడిక్రూటర్ ఎండీ రోనాల్డ్ రెస్కే పాల్గొన్నారు.

## అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ...

మాట్లాడితే ఇలానే ఉంటుందన్నారు.

**అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ ఉపేక్షించం.. :**

అధర్మంగా, దుర్మార్గంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ ధర్మం శిక్షిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను పోసాని ఇష్టం వచ్చినట్టు మాట్లాడి దూషించాడని, ఇంట్లో ఉన్న ఆడ బిడ్డల గురించి కూడా చాలా అసహ్యంగా మాట్లాడాడని మంత్రి మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయాలనుకుంటే అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అందరినీ లోనికి పంపించేవాళ్లమని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగానే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

**అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు.. :**

వైసీపీ నేతలు చేసిన పాపాలే వాళ్లని వెంటాడుతున్నాయని, కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా, ఆనందంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని, పెన్షన్ సొమ్ము పెంచి ఇస్తున్నామని తెలిపారు. దీపం పథకం కింద అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని తెలిపారు. మే నెలలో తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ లకు నిధులు తెచ్చి పనులు ప్రారంభిం చామని.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి నిధులు, పెట్టుబడులు తెస్తున్నామని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో రాష్ట్రం అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలవనుందని అన్నారు.

**పేర్నినానిపై హాట్ కామెంట్స్... :**

మాజీ మంత్రి పేర్ని నాని మీద మంత్రి కొల్లు రవీంద్ర హాట్ కామెంట్స్ చేశారు. పేర్ని నాని చాలా ఫ్రెస్టేషన్‌లో ఉన్నారని, తన గోడౌన్ నుండి రేషన్ బియ్యం ఏ రకంగా తరలి వెళ్లిందో, ఎక్కడి నుంచి ఏ లారీ బయల్దేరిందో చెక్?పోస్ట్ నుంచి ఏ లారీ దాటిందో అన్నీ బయటకు వస్తాయని అన్నారు. కాకినాడ షిప్పుల్లో అక్రమంగా బియ్యం ఎలా రవాణా అయ్యిందో వివరాలన్నీ ఉన్నాయని మంత్రి తెలిపారు. పేర్ని నాని అకౌంట్?లో డబ్బులు ఏ విధంగా వచ్చాయి.. ఆయన భార్య జయసుధ అకౌంట్?లో డబ్బులు ఎలా క్రెడిట్ అయ్యాయో ఇలా అన్నీ బయటకు వస్తాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

## పోసాని అండగా...

మీరు ధైర్యంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో నిరంకుశపాలన ఎక్కువ రోజులు కొనసాగదని జగన్ అన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా కూటమి నాయకులు చంద్రబాబు, నారా లోకేష్, సినీ పరిశ్రమలో వర్గ విభేదాలు సృష్టించేలా ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోసానిపై జనసేన నేత జోగినేని మణి ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశాడు. జనసేన కార్యకర్త ఫిర్యాదు మేరకు పోసాని కృష్ణ మురళిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు పోసానిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని అన్నమయ్య జిల్లాకు తరలించి విచారణ చేపట్టారు.

## శ్రీశైలం, నాగార్జున సాగర్ నీటిని...




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పంటల సాగును దృష్టిలో ఉంచుకుని నీటిని వినియోగించుకోవాలని చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలోని బోర్డు నిర్ణయించింది. ఈ బోర్డు సమావేశం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇతర ఇంజినీర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తెలంగాణ రాష్ట్రానికి 63 టీఎంసీల నీరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 55 టీఎంసీల నీరు అవసరమని ఆయా రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో వినియోగ మట్టానికి 60 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు సూచించింది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని తెలిపింది.

## కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు..

### వచ్చేనెల 5కు విచారణ వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు : తెలంగాణ భారతీయ జనతాపార్టీ ప్రధాన కార్యదర్శి కాసం వేంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసు విచారణను గురువారం ప్రజాప్రతినిధుల కోర్టు చేపట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరఫున గైర్హాజరు పిటిషన్‌ను కోర్టుకు సమర్పించడంతో కోర్టు అంగీకరించి వచ్చేనెల 5కు విచారణను వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ పార్టీ అధికారం చేపడితే రిజర్వేషన్లను పట్టించుకోదని రేవంత్ చేసిన వాఖ్యల పట్ల తమ పార్టీ పరువు ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదముందని ఫిర్యాదుదారుడు కాసం కోర్టులో పరువు నష్టం దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు సీఎం కోర్టుకు హాజరుకా లేదు. ఫిర్యాదుదారుడి వాంగ్మూలంతోపాటు సాక్షుల వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. ప్రముఖ టీవీ ఛానళ్లలో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలకు సంబంధించిన



క్లిప్పింగ్‌లను సాక్ష్యాధారాలుగా కోర్టుకు సమర్పించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ బహిరంగ సభలో రేవంత్ చేసిన ప్రసంగం పట్ల బీజేపీ పార్టీ సీరియస్‌గా పరిగణించి కోర్టును ఆశ్రయించింది. ఫిర్యాదుదారుడి సాక్ష్యంతోపాటు సాక్షుల సాక్షాధారాల్ని పరిశీలించిన పిదప కోర్టు కేసు విచారణ కొనసాగిస్తుంది. నిందితుడు రేవంత్ తరఫున న్యాయవాది నేరం చేయలేదని రుజువుచేయాల్సి ఉంటుంది.

### ప్రపంచంలోనే భారతదేశ జీవన విధానం...

## అత్యుత్తమైనది : డాక్టర్ చంద్రప్ప



శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:శ్రీకాళహస్తి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భారతీయ జీవన పరి వర్తనమ్ చారిటీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీ శ్వర స్వామి వారి దర్శనార్థం అశేష సంఖ్య లో విచ్చేస్తున్న భక్తులకు చారిటీ వ్యవస్థాప కులు , చైర్మన్ డాక్టర్ చంద్రప్ప కళ్యాణి తమ కుటుంబ సభ్యులతో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమా, సరిత అరవింద్ విష్ణు,తరుణ్, జస్వంత్, ప్రభాకర్ నాయుడు భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### బోదేషావలి దర్గా అభివృద్ధికి ...


## 20 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:అన్నమయ్య పీలేరు పట్టణం మదనపల్లి రోడ్డు మార్గంలోని బోదేషా వలి దర్గా అభివృద్ధికి తోడ్పాటు నిస్తూ పీలేరు పట్టణ ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటూ దర్గా ఆవరణలో ప్లాట్ఫారం నిర్మించడానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కి ముస్లిం మత పెద్దలు ధన్యవాదాలు తెలిపారు.వచ్చేనెల 2న పవిత్రమైన రంజాన్ నెల పర్వదినం ప్రారంభం సందర్భంగా గురువారం దర్గా ఆవరణలో ఫ్లాట్ ఫామ్ నిర్మాణం జరుగు తున్న క్రమంలో ముస్లిం మైనార్టీలు మత పెద్దలు పనులు పరిశీలించారు.అనంతరం ముస్లిం మైనారిటీలు దర్గా ఆవరణలో కిషోర్ కుమార్ రెడ్డి, వారి కుటుంబ సభ్యు లకు ఆ అల్లా చల్లగా చూడాలని దువా ఇస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి మల్లెల రెడ్డి భాష, టిడిపి సీనియర్ నాయకులు జాఫర్, అల్లావుద్దీన్, మొహమ్మద్ పీర్, కే జీ ఎన్ రెడ్డి భాష రహమతుల్లా అమీర్, మహ బూబ్ సాహెబ్, టిడిపి నాయకులు మౌలా, అతికా షఫీ ఉల్లా,చాంద్ బాషా, షౌఖత్, నౌలాక్,దర్గా కమిటీ సభ్యులు మహబూబ్ బాషా రియాజ్ రెడ్డి భాష బోదేషా, జాఫర్ రెడ్డి భాష రఫీ తదితరులు ముస్లిం మైనార్టీ మత పెద్దలు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు...

## మూడు నెలల పొడిగింపు



చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు మార్చి 01, 2025 నుండి మే 31,2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఐ ఏ ఎస్ వారు గురువారం నాడు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుతం ఫిబ్రవరి 28,2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 01,2025 నుండి మే 31,2025 వరకు అక్రిడేషన్ పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ మరియు డిఎంఏసి చైర్మన్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

## అత్యంత వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27: పులిచెర్ల మండలం జాండ్రపేట శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపు కున్నారు. ఆలయంలో గురువారం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు గిరిజా కళ్యాణం వేదమంత్రాలతో నిర్వ హించారు. ఉభయ దారులు గోటూరి అమరనాథరెడ్డి పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం సిద్ధ పూజను నిర్వహించి పూజలు చేశారు. ఉభయ దారులు జయప్రకాశ్ రెడ్డి పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఆలయ ధర్మకర్త వారణాసి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ నిర్వహణ కమిటీ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీటీడీ ఉద్యోగి పావని,చిత్తూరుకు చెందిన నీరజ్ స్వామివారికి వెండి శత గోపం విరాళంగా అందజేశారు.



# శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27 : శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తి తో శ్రీకాళహస్తి పట్టణం నందు ప్రతి గురువారం మధ్యాహ్నం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వారం 33 వ వారం బస్టాండ్ సెంటర్లో అన్నదానం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇం చార్జ్ పేట చంద్రశేఖర్,పట్టణ ప్రధాన కార్య దర్శి పేట చిరంజీవి,లక్ష్మణ్,దినేష్, ఏర్పేడు మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ యాదవ్,లక్ష్మణ్ యాదవ్,మనీ,ముని చంద్ర,కత్తిమని,ముని కుమార్,వీర మహి ళలు,శారద,గాయత్రి, బత్తేమ్మ,,తదితరులు పాల్గొన్నారు.



### అంగరంగ వైభవంగా...

# అంగాల పరమేశ్వరి స్మశాన కోళ్ళై వేడుకలు







శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం బోయలపల్లి గ్రామంలో వెలిసిన ఆంగాల పరమేశ్వరి బ్రహ్మోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలలో భాగంగా బుధవారం నాడు గ్రామ స్మశాన వాటిక నందు స్మశాన కొళ్ళై వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చంద్రప్ప మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం మేల్ మలైనూర్ గ్రామంలో వెలసిన అంగాల పరమేశ్వరి అమ్మవారు భక్తుల కొంగు బంగారంలా వెలసి, నిత్య పూజలు అందుకుంటున్నట్టు తెలిపారు. బోయినపల్లి గ్రామస్తులు సైతం అమ్మవారి పై విశ్వాసంతో తమిళ సాంప్రదాయాన్ని అనుసరించి, మొదటిసారి అమ్మవారి బ్రహ్మోత్సవాలను తమ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ నుండి మార్చి రెండవ తేదీ వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నట్టు తెలిపారు. రోజుకో వేడుకలతో ఆరు రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నాడు గ్రామ స్మశాన వాటికలో స్మశాన కోళ్ళై వేడుకలు గ్రామస్తులతో కలిసి తమ అధీనంలో నిర్వహించడం పూర్వజన్మ సుకృతమన్నారు. తమ గ్రామంలో మొదటిసారి జరుగుతున్న ఈ వేడుకలకు మూడు రాష్ట్రాలకు చెందిన అమ్మవారి భక్తాదులు విచ్చేయడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు.

# అమరవీరుల దినోత్సవం విజయవంతం చేయండి

పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:అన్నమయ్య జిల్లా పీలేరు ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకోసం అమరులైన అమరవీల దినోత్సవన్ని మార్చి 01 న గ్రామ,మండల నియోజకవర్గ,జిల్లా లో ఘనంగా నిర్వహిం చాలని ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతి నిధి రామకృష్ణ తెలిపారు.ఆయన మాట్లా డుతూ..అభినవ అంబేద్కర్ మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనకై ప్రాణాలర్పించిన అమర వీరులకు జిల్లా, నియోజకవర్గ, మండల, స్థాయిలో మార్చి 01వ తారీఖున ఘనంగా నిర్వహించి షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనలో అమరుల త్యాగాలను గ్రామ, మండల స్థాయిలో విద్యార్థుల కు, నిరుద్యోగులకు, మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలకు తెలి యచేయా లనీ విజ్ఞప్తి చేశారు. ఎంఎస్పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ పీలేరు నియోజక వర్గంలోని ఆరు మండలాల ఎమ్మార్పిఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులం దరూ మార్చి ఒకటవ తేదీన పీలేరు కేంద్రా నికి చేరుకొని అమరవీరుల దినోత్సవం విజయవంతం తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఎస్పి పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ గండికోట వెంకటేష్,



పీలేరు మండల ఇంచార్జ్ చరణ్ కుమార్ యువ నాయకులు యువనాయకులు రెడ్డి కుమార్,నరసింహ, రాజేష్, వాల్మీకిపురం మండలాధ్యక్షుడు గంత బాలకృష్ణ, కె.వి పల్లి మండలం ఇన్చార్జి రాము, సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

### రథోత్సవం సందర్భంగా పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ...

# పూర్వ విద్యార్థులచే అన్నదాన కార్యక్రమం




శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం 1982 - 83 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సూపర్ స్నేహితుల మిత్ర బృందం ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.భక్తులకు అన్నదానం పంపిణీ చేశారు.సూపర్ స్నేహితుల ద్వారా ఘనసీయంగా ఉగాదికి ,మహా శివరాత్రికీ అందరూ ఒకతాటి మీదకి వచ్చి కార్యక్రమా లు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సూపర్ స్నేహితుల మిత్రబృం దం ప్రెసిడెంట్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ పానగల్ ప్రభుత్వ ఉన్న త పాఠశాలలో 1982-83 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు సూపర్ స్నేహితుల మిత్ర బృందంగా ఏర్పడి గత 15 సంవత్సరాలుగా రథోత్సవం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరు గుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఉగాది,మహాశివరాత్రి ఉత్సవాలలో ఈ సూపర్ స్నేహితుల మిత్ర బృందం అన్న దాన కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ రోజున సుమారుగా 2000మందికిపంపిణీ చేశామన్నారు. తమ మిత్రబృందంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలిగిన కలిసికట్టుగా ఉంటూ వారికి మేమున్నాం అంటూ భరోసాగా నిలబడుతున్నామ న్నారు. ప్రజలకు సేవా,సాయం చేయాలనే ఉద్దేశంతో తామంతా ఒక కమిటీగా ఏర్ప డ్డామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, సూపర్ స్నేహితుల మిత్ర బృందం ప్రెసి డెంటు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొట్లులూరు రవిచంద్ర, వైస్ ప్రెసిడెంట్ లు ఎన్.ఎస్.రాఘవన్,ఎస్ మణి, ట్రెజరర్ పట్టెం సురేష్ బాబు, కార్య దర్శిలు షేక్ అబ్దుల్ జబ్బార్, పముజుల అమృతమ్మ, ఎస్. రమణ, సభ్యులు ఎన్ వెంకటేష్,పి.రమ,అత్తిరాల భాస్కర్,షేక్ అక్బర్ భాషా,చిర్రి గోపాల్,రెడ్డిపల్లి ప్రసాద్, రాజేంద్ర, వేదం కృష్ణయ్య, బిందు కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసిన...

## కమిషనర్ పి నరసింహ ప్రసాద్



చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27: నగరపాలక పరిధిలోని 5వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. వార్డు సచివాలయంలో కార్యదర్శుల హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని, పన్నుల వసూళ్లలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. వివిధ పనులపై వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం కమిషనర్ కొంగారెడ్డిపల్లి, పుత్తూరు రోడ్డులో పారిశుధ్య నిర్వహణ, ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు. పుత్తూరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అంచనాలు రూపొందించి సమర్పించాలని ఏఈని ఆదేశించారు. నగరం మొత్తంలో లైటింగ్ వ్యవస్థ ఆటోమెటిక్ సెన్సార్ విధానంలో పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల శుభ్రత పనులను తనిఖీ చేశారు. కమిషనర్ వెంట ఎంహెచ్వో డా లోకేష్, ఇతర అధికారులు ఉన్నారు



### బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం...

## ఇంటర్వ్యూ కార్యక్రమం




వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27: వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపిడివో ఆమర్నాధ్,బ్యాంకర్లు....

## ఆర్వో ప్లాంట్ ద్వారా ప్రజలకు శుద్ధ జలం



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగులో ఆర్వో ప్లాంట్ ద్వారా ప్రజలకు శుద్ధ జలం అందిస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు దామోదర రెడ్డి తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ విరూపాక్షమ్మకు సిద్ధ పూజ



కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ దిగువ మూర్తి వారి పల్లి లో వెలసిన శ్రీ విరుపాక్షమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి సిద్ధ పూజ నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గురుస్వామి, అరుణ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు సిద్ధ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, భరత్ కుమార్,అనిత, అలివేలమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# తగ్గేదెలా...

## - వైసీపీపై పవన్ యాక్షన్



విజయవాడ, : పవన్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో.. పవన్ రంగంలోకి దిగితే ఎలా ఉంటుందో చెప్పడానికి.. అసెంబ్లీ సాక్ష్యంగా మారింది. ఒక్కో మాట.. ఒక్కో తూటాలా వినిపించింది. స్వరం మారేదే లేదు.. స్టాండ్‌లో మార్పు లేదు అన్నట్లుగా ఫ్యాన్ పార్టీని చెడుగుడు ఆడుకున్నారు పవన్. పొత్తుల నుంచి అసెంబ్లీలో వైసీపీ ఎత్తుల వరకు.. కొన్నింటికి క్లారిటీ, ఇంకొన్నింటికి తన మార్క్ వార్నింగ్ ఇచ్చారు. సేనాని ఈజ్ బ్యాక్ అనిపించారు.వైసీపీ, పవన్ యుద్ధం.. ఎప్పటికీ చల్లారనిది! అదే అనిపించింది అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మాటలు వింటే. నిజానికి ఎన్నికల ముందు ఫ్యాన్ పార్టీని పవన్.. అంశాలవారీగా చీల్చి చెండాడారు. డిప్యూటీ సీఎం అయ్యాక.. పాలనపై మీదే ఫోకస్ పెట్టి తన పని తాను చేసుకోపోతున్నారు. ఐతే వైసీపీ నుంచి మాత్రం విమర్శలు ఆగలేదు.కూటమిలో లుకలుకలు స్టార్ట్ అయ్యాయని.. పవన్ దూరం జరుగుతున్నారంటూ సోషల్‌మీడియా వేదికగా వైసీపీ ప్రచారం మొదలుపెట్టింది. ఐతే వాటిపై ఇన్నాళ్లు మౌనంగా ఉన్న పవన్.. అసెంబ్లీ సాక్షిగా విరుచుకుపడ్డారు. పాత పవన్‌ను గుర్తు చేశారు. అదే ఫైర్.. అదే దూకుడు.. తగ్గేదే లే, తగ్గింది లే అన్నట్లుగా పవన్ మాటలు వినిపించాయ్.అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు 20 నిమిషాలు మాత్రమే సభకు హాజరైన వైసీపీ ఎమ్మెల్యేలు.. గందరగోళం క్రియేట్ చేశారు. స్పీకర్ పోడియం ఎదుట నిరసన తెలపడంతో పాటు.. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డగించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో జగన్ తీరుపై.. పవన్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.ప్రతిపక్ష హోదా రాదని ఫిక్స్ అవ్వాలంటూ చురకలు అంటించారు. దీనిపై వైసీపీ రియాక్ట్ అవగా.. శాసనసభ వేదికగా పవన్ ఫైర్ అయ్యారు. వైసీపీ సభ్యుల తీరు చూస్తే టెర్రరిజం గుర్తుకు వచ్చిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేరెత్తి చెప్పకపోయినా.. వైసీపీ ప్రతీ మాటకు కౌంటర్ ఇచ్చారు. పవన్ మాటలు.. ఫ్యాన్ పార్టీకి తగలాల్సినచోట తగినట్లు అనిపించాయ్.వైసీపీ చేసిన రచ్చకు తాను క్షమాపణ చెప్తున్నానంటూ.. ఫ్యాన్ పార్టీని దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు పవన్. ఇది రాజకీయంగా జనసేనకు కలిసివచ్చే అవకాశాలు లేకపోలేదు. కూటమి విషయంలో స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. పదేళ్లు కూటమిగానే ఉంటాం.. అధికారం తమదే అన్న పవన్ ఇప్పుడు మరో ఐదేళ్లు పెంచారు.కూటమి ప్రభుత్వం 15ఏళ్లు కొనసాగుతుందని చెప్పారు. ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారని.. ఏదీ పట్టించుకోమని అన్నారు. కూటమిలో లుకలుకలు అంటూ వైసీపీ చేస్తున్న ప్రచారానికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా.. కలిసే ఉంటామని కూటమిని నిలబెడతామని హామీ ఇచ్చారు.వైసీపీ విషయంలో ఎప్పటికీ తగ్గేదే లే అన్నట్లు పవన్ మాటలు వినిపించాయ్. ఎన్నికల ప్రచారంలో వైసీపీని నిలదీసిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా అదే కంటిన్యూ చేస్తున్నారు. ప్రజావేదికల కూల్చివేతల నుంచి.. అమరావతి రైతులపై దాడు, చంద్రబాబు జైలు, కల్తీ లడ్డూ వరకు ప్రతీ విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఫ్యాన్ పార్టీని ఓ ఆట ఆడుకున్నారు పవన్ కల్యాణ్.వైసీపీ విషయంలో ఏ విషయం మర్చిపోయేది లేదని.. అన్నింటినీ నిలదీస్తాం, కడిగేస్తాం అన్నట్లుగా కనిపిస్తున్నారు. రాజకీయ వైరం మాత్రమే కాదు.. అంతకుమించి అన్నట్లుగా వైసీపీ మీద పవన్ యుద్ధం చేస్తున్నారా అనిపిస్తోంది కొన్నిసార్లు ! చంద్రబాబు అయినా వైసీపీ విషయంలో అంతో ఇంతో మౌనం వహిస్తున్నారేమో కానీ.. పవన్ మాత్రం అలా కనిపించడం లేదు.

### పవన్ వ్యాఖ్యలతో...

## పార్టీ కేడర్‌లో అసహనం

కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా మారిపోయారంటున్నారు. ప్రశ్నించడం మానేసి ఫక్తు రాజకీయ నేత అవతారమెత్తారన్నది ఆ పార్టీనేతలతో పాటు సొంత సామాజికవర్గం నుంచి వినిపిస్తున్న మాటలు. గతంలో పదేళ్ల పాటు ప్రశ్నిస్తూ, ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ పాలిటిక్స్ లోనూ పవర్ స్టార్ గా చెలామణి అయిన పవన్ కల్యాణ్ గొంతు గత తొమ్మిది నెలల నుంచి పెగలకపోవడంపై సొంత పార్టీ క్యాడర్ అసహనం వ్యక్తంచేస్తుంది. ఎవరైనా పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలనుకున్నారు. లక్షలాది మంది ఆయన అభిమానులతో పాటు, కాపు సామాజికవర్గం కూడా పవన్ వల్లనే తొలిసారి తమకు ముఖ్యమంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. కానీ పవన్ వ్యాఖ్యలు చూస్తుంటే అది నిజమయ్యేటట్లు కనిపించడం లేదంటున్నారు. మొన్న పదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రి గా కొనసాగాలని ఆకాంక్షించిన పవన్ కల్యాణ్ తాజాగా మరో ఐదేళ్లు పెంచి పదిహేనేళ్ల వరకూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని చెప్పారు. ఎన్ని లొసుగులు ఉన్నప్పటికీ తాము కలసే ఉంటామని చెప్పారు. జగన్ పై విమర్శలు చేసిన పవన్ కల్యాణ్ చంద్రబాబు పరిపాలన దక్షతను మరోసారి ప్రశంసించారు. గ్రూప్ 2 అభ్యర్థులకు జరిగిన అన్యాయం విషయంలో కానీ, మిర్చి రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నప్పటికీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా వదిలేయడాన్ని వేరేరకంగా అభిమానులు చూస్తున్నారు.పదేళ్లు తాము చూసిన పవన్ కల్యాణ్ వేరు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తున్న ఆయన వేరు అన్నట్లుగా ఉందని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని తప్పులు చేస్తున్నా ప్రశ్నించకుండా ప్రశంసించడమేంటని జనసేన నేతలే అంటున్నారు. జగన్ ను ప్రజలు ఛీ కొట్టారు. ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు. అలాంటి జగన్ ను విమర్శించి ఏమాత్రం ప్రయోజనం లేదు. అదే సమయంలో ప్రజాసమస్యలపై నిలదీసే తత్వాన్ని పవన్ కల్యాణ్ పూర్తిగా కోల్పోయారంటూ జనసేన పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. సనాతన ధర్మమంటూ తిరిగితే సరిపోతుందా? ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన పనిలేదా? అని ఎదురు ప్రశ్నలు పవన్ కు ఎదురవుతున్నాయి.కూటమి ధర్మం కాబట్టి పవన్ కల్యాణ్ టీడీపీని ప్రశ్నించలేకపోవచ్చు. కానీ అదే సమయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రయత్నించడం ఎంత మాత్రం తప్పు కాదు. మిర్చి రైతుల ఆందోళన జరుగుతున్నప్పుడు మిర్చి యార్డుకు వెళ్లవచ్చు. అలాగే కొన్నినిర్ణయాలు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్నా, దానిని వెనకేసుకు రావడం ఏమాత్రం బాగాలేదని సొంత పార్టీ క్యాడర్ అంటుంది. ఇప్పటి వరకూ పవన్ కల్యాణ్ అధికారంలో లేరు కాబట్టి ఆయన ఏం మాట్లాడినా చెల్లింది.

## భూసార పరీక్ష పత్రాల ఫలితాల పై అవగాహన కార్యక్రమం



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలో కేంద్ర ప్రభుత్వ పీయం ప్రణామ్ భూసార పరిరక్షణ పథకం కింద రైతులు తప్పని సరిగా భూసార పరిరక్షణ పరీక్షలు చేయించుకుని పంటలలో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అదికారి నాగరాజు రైతులకు సూచించారు. మండల పరిధిలోని కనమనపల్లి, బెగ్గిలపల్లి సోడిగానపల్లి, అగరం గ్రామాలలో భూసార పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్ష పత్రం ఆధారంగా నేల రకము, వివిధ పోషకాల లభ్యత, నత్రజని, భాస్వరం, పొటాషియం మరియు సూక్ష్మధాతుల లభ్యత తెలుసు కోవచ్చు. తద్వారా రైతు ఏ ఏ ఎరువులు వాడాలి ఎంత మోతాదులో వాడాలి అని తెలుసుకోవచ్చన్నారు. భూసార పరీక్ష పత్రము ఒక్కసారి జారీ చేసిన యెడల మూడు సంవత్సరాల కాలం వరకు రైతు వేసే పంటకు అన్వయించుకుని ఎరువులు వాడుకోవచ్చు. దీని ద్వారా, అవసరమైన మేరకు మాత్రం ఎరువులు వాడటం ద్వారా పెట్టుబడి తగ్గించుకుని నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చునని, నేల ఆరోగ్యాన్ని, వాతావరణ ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చు అని తెలిపారు,ఈ పథకం ద్వారా రైతులు ఉచితంగా భూసార పరీక్షలు చేసుకొని మంచి దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. రైతులకు భూసార పరీక్ష పథకం కింద భూసార పత్రాలు కూడా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి..



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు గురువారం ఎస్ఆర్ పురం మండలం ఎస్ ఎల్ వి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామక పత్రాన్ని పంపిణీ చేశారు. ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడిగా మంగుంట గ్రామానికి చెందిన నాగ ముని రెడ్డి, బుజ్జిరెడ్డి మండల అధ్యక్ష నియామక పత్రాన్ని అందించారు. అలాగే వెదురుకుప్పం మండల అధ్యక్షుడు ఉమేష్ నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తులసిమని శీనురెడ్డి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్ ఆర్థిక సహాయంతో ...

## ఆసుపత్రి అంబులెన్స్ మరమ్మతులు



**సత్యవేడు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:** సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రిలో గత సంవత్సరం నుండి మరమ్మత్తులు గురై మూలకు చేరిన అంబులెన్స్ ని తెదేపా నాయకుడు, పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్,ఆర్థిక సహాయంతో సత్యవేడు తెదేపా రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ చొరవతో అంబులెన్స్ మరమ్మత్తులు జరిపి వినియోగంలోకి తీసుకొచ్చారు.రూ: లక్ష రూపాయలు తెదేపా నాయకులు పారిశ్రా మికవేత్త గంగా ప్రసాద్ సొంత నిధులతో అంబులెన్స్ కోసం కొత్త సీల్ టైర్లు, ఆయిల్ సర్వీస్,గ్లాస్,ఇన్సూరెన్స్ తదితర ఏర్పాటు చేయడంతో అంబులెన్స్ వినియోగంలోకి వచ్చింది. గురువారం సిహెచ్ ఆవరణలో పలువురు తెదేపా నాయకులు అంబులెన్స్ ను లాంఛనంగా ప్రారంభించి ఆసుపత్రికి అప్పగించారు. అంబులెన్స్ వినియోగం లోకి రావడంతో స్థానికులు,ప్రజలు,రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపామండల ప్రధాన కార్యదర్శి శివయ్య, సిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, ఆసుపత్రి కమిటీ సభ్యులు శోభ, నాయ కులు పామా%శీ%జీ వాసు,ఆది,కోనయ్య, శివానందం తదితరులు పాల్గొన్నారు.

### మీరు టెన్త్ ఇంటర్ డిప్లమో లేదా ఏదైనా డిగ్రీ చేసి ...

### ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నారా ...

## అయితే ఈ సదవకాశం మీ కోసమే

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27:** ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోద్బలంతో 1 ఎం1 బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిం చబడతాయి.వివిధ నగరాల్లో ఉన్న ప్రముఖ సంస్థల యందు అనేక రకాల ఉద్యోగ అవకాశాలకు నిరుద్యోగులను సన్నద్ధం చేసి,ఉద్యోగాలు ఇప్పించ డానికి 1 ఎం1బి గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ ద్రవిడి యూనివర్సిటీ కుప్పం నందు 27 ఫిబ్రవరి మరియు 28 ఫిబ్రవరి రెండు రోజులు ప్రి ప్లేస్మెంట్ ట్రైనింగ్ నిర్వహించ బడును.దీనిలో పాల్గొన్న వారికి మాత్రమే 11 వ తేదీన జాబ్ మేళా లో పాల్గొనే అవకాశం వస్తుంది.అనగా ఇంటర్వ్యూకి ఏ విధంగా ప్రిపేర్ అవ్వాలి?... ఇంటర్వ్యూను ఏ విధంగా ఎదుర్కోవాలి? మరియు జాబ్ సాధించడానికి ఏ రకమైన స్కిల్స్ ని మీరు Reaume లో రాయాలి... మరియు మంచి Resume రాయడం ఎలా? తదితర వివరాలను 1%వీ1డీ% గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్ నందు 27 మరియు 28 తేదీలలో వివరంగా తెలుపుటకు సిద్ధంగా ఉన్నారు.మరియు మార్చ్ 11 2025 న మిని జాబ్ మేళా నిర్వహించ బడును కాబట్టి ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకోని టెన్త్ , ఇంటర్, డిప్లమో లేదా ఏదైనా డిగ్రీ గల నిరుద్యోగ యువతీ యువకులు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాన్ని పొందుటకు మార్గాన్ని సుగమం చేసుకున గలరని కోరుచున్నాము,

ఇట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్

కడజి

## అంతు పట్టని జగన్ స్ట్రాటజీ

విజయవాడ, : అనర్హత భయమే వైసీపీని అసెంబ్లీకి తీసుకొచ్చిందా.. అందుకే ఒక్కరోజు సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారా.. అదే నిజం అయితే మళ్లీ ప్రతిపక్ష హోదా నినాదం ఎందుకు.. అసెంబ్లీలో జగన్ ఎపిసోడ్‌పై జరుగుతున్న చర్చ ఏంటి?కూటమి అధికారంలోకి వచ్చాక.. ఎప్పుడూ లేనంత ఆసక్తి రేపాయ్ ఈసారి అసెంబ్లీ సమావేశాలు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని.. లేదంటే ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నిస్తూ ఉంటానని చెప్పిన జగన్.. బడ్జెట్ సమావేశాలకు హాజరు కావడమే దీనికి కారణం. సభకు వచ్చిన జగన్.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. గవర్నర్ ప్రసంగం జరుగుతున్న సమయంలో ఆందోళనకు దిగారు.పోడియం ఎదుట.. ప్రతిపక్ష పార్టీ హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. కొద్దిసేపు నిరసనలు చేసిన తర్వాత.. ప్రభుత్వం తీరు, గవర్నర్ స్పీచ్?కు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. సభకు వచ్చినట్లే వచ్చిన జగన్.. 20 నిమిషాల్లోనే పార్టీ సభ్యులతో కలిసి వాకౌట్ చేయటం కొత్త చర్చకు కారణం అయింది. జగన్ అలా వచ్చి ఇలా వెళ్లడం ఇప్పుడు రాజకీయ రచ్చకు కారణం అవుతోంది. భయంతోనే జగన్ అసెంబ్లీకి వచ్చారంటూ అధికార పార్టీ నేతలు ఓ రేంజ్‌లో టార్గెట్ చేస్తున్నారు.నిజానికి అసెంబ్లీకి వైసీపీ హాజరుపై.. కొంతకాలంగా భారీ మాటల యుద్ధం జరుగుతోంది. స్పీకర్ చైర్‌లో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఉండగా.. జగన్‌ను సభలో కూర్చొబెట్టాలని అధికార ఆశపడుతుంది అనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఐతే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేగాని సభకు రానంటూ జగన్ డిమాండ్ చేస్తున్నారు.దీంతో అధికార పార్టీ సరికొత్త అస్త్రాన్ని తెరమీదకు తీసుకవచ్చింది. 60 రోజులు సభకు రాకపోతే.. చట్టప్రకారం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని స్పీకర్ అయ్యన్నతో పాటు.. డిప్యూటీ స్పీకర్ రఘురామ వార్నింగ్ ఇచ్చారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు అనర్హత ప్రమాదం నుంచి బయటపడాలంటే.. సభకు వచ్చి తీరాల్సిందేనని తేల్చి చెప్పారు.దీంతో రాజకీయం రసవత్తరంగా కనిపించింది. ఇలాంటి పరిణామాల మధ్య జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీకి హాజరై.. ప్రతిపక్ష హోదా నినాదం వినిపించి వెళ్లిపోయారు. జగన్ తీరుపై ఇప్పుడు అధికార పార్టీ మాటల యుద్ధం మొదలుపెట్టింది. 60రోజుల పాటు అసెంబ్లీకి రాకపోతే సభ్యత్వం కోల్పోతామనే భయంతోనే.. జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారంటూ టార్గెట్ చేస్తున్నారు.ప్రజాస మస్యల గురించి మాట్లాడకుండా ప్రతిపక్ష హోదా అడగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో ప్రతిపక్ష హోదా రాదని వైసీపీ నేతలు ఫిక్స్ అయితే బెటర్ అంటూ పవన్ కల్యాణ్ సెటైర్లు వేశారు. ఓవరాల్‌గా జగన్ రాక.. ఇప్పుడు ఏపీ రాజకీయా లను మరింత ఇంట్రస్టింగ్‌గా మార్చింది. ఇక అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత.. పార్టీ నేతలతో తాడేపల్లిలో భేటీ అయిన జగన్.. ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని.. అసెంబ్లీకి వెళ్లడం కంటే.. జనాల్లోకి వెళ్లి పోరాడడం బెటర్ అని నేతలకు సూచించారు.అసెంబ్లీలో సంతకాలు చేసి.. అనర్హత పడకుండా వైసీపీ నేతలు జాగ్రత్త పడ్డారని.. ఇదంతా భయమే అని అధికార పార్టీ నేతలు వైసీపీ టార్గెట్‌గా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ భయంతోనే ఒక్కరోజు సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారని.. ఇకపై హాజరుకానని చెప్పేది అందుకే అంటున్నారు.ఏమైనా ఏపీ అసెంబ్లీ రూల్స్ చుట్టూ తిరిగిందీ రెండు రోజులు. 60రోజులు వరుసగా హాజరుకాకపోతే రూల్స్ ప్రకారం సభ్యత్వం రద్దవుతుందని వైసీపీని అధికార పార్టీ సభకు రప్పిస్తే.. ఒక్కరోజు అలా వచ్చి సంతకాలు చేసి.. ఇక రామని చెప్పి అదే రూల్స్‌ను ఆయుధంగా వాడుకుంది వైసీపీ అనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. సభకు వచ్చినట్లే వచ్చి.. వాకౌట్ చేసి జగన్ తన స్ట్రాటజీ ఏంటూ ప్రూవ్ చేసుకున్నారన్నది మరికొందరి అభిప్రాయం. అసెంబ్లీ సమావేశాలు మరీ ఇంత ఆసక్తిగా ఉంటాయని అనుకోలేదంటూ చర్చ మొదలుపెట్టారు.. ఈ వ్యవహారం అంతా చూసినవాళ్లు.

## మున్సిపాలిటీకి వినతిపత్రం అందించాము

### అఖిల కర్ణాటక పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల సేవా సంఘ్



**కొలరు జిల్లా, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 27:** ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించాలని రాష్ట్ర అధ్యక్షుడు మురళీగౌడ్ ఆదేశాల మేరకు శ్రీనివాస్‌పూర్ మున్సిపాలిటీకి వినతిపత్రం అందించాము మరియు మెగా అభిమానులు క్లాత్ బ్యాగులను పంపిణీ చేసారు మరియు పవన్ కళ్యాణ్ అభిమానుల సంఘం, శ్రీ రామ్ గౌడ్ ఆదర్శ ఎన్ఎస్ ప్రసాద్ సందీప్ పాల్గొన్నారు.

### సిద్ధలయ్య కోనలో మహాశివరాత్రి పర్వదినం...

## ప్రత్యేక పూజలు



**బుచ్చినాయుడు కండ్రిగ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 27:** తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కళ్లివెట్టు, తలారివెట్టు గ్రామ స్తులు మహాశివరాత్రి పర్వదినం సందర్భం గా ప్రత్యేక పూజలు,నిర్వ హించారు. ఎన్నో దశాబ్దాల నుంచి బ్రిటిష వారి పాలననుంచి శివున్ని సిద్ధలయ్యకు ఆరాధ దేవుడిగా అప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామ ప్రజలు కొలుస్తూనే మొక్కలు తీర్చుకుంటూ ముందుకు వెళుతున్నారు.గ్రామస్తులు రుద్రాక్ష మాల అభిషేకం,పట్టు వస్త్రాలు స్వామి వారికి అందజేశారు. పురోహితులు అభిషేకం ప్రత్యేక పూజలు ఘనంగా ఆట పాటలతో తప్పిట్ల మేళాలతో ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో గ్రామా భక్తుల ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు,తీర్థ ప్రసాదాలు, అందజేసి.మధ్యాహ్నం అన్నదానం కార్య క్రమం చేపట్టారు. సాయంత్రం తపిట్లా మేళాల,టపాసుల నడుమ కార్యక్రమంలు నిర్వహిస్తూ మహా శివరాత్రి జాగారంలో పంచాక్షరీ ఓం నమశ్శివాయ) నిత్య పూజ లు నిర్వహిస్తారు. గ్రామస్తులు స్వామి వారిని దర్శించు కుని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు సిద్ధలయ్య కోనలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడికి సిద్ధలయ్యకు, ప్రత్యేక పూజలు తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఉబ్బల మడుగు, సిద్దలయ్య కోన లో వెలిసిన శివుడికి సిద్ధలయ్య కు, కళ్లివెట్టు, తలారివెట్టు గ్రామస్తులు మహా శివరాత్రి పర్వదినం సందర్భం గా ప్రత్యేక పూజల. నిర్వహించారు. ఎన్నో దశాబ్దాల నుంచి బ్రిటిష వారి పాలన నుంచి శివున్ని సిద్ధలయ్య కు ఆరాధ దేవుడిగా అప్పటి నుంచి ఇప్పటివరకు గ గ్రామ ప్రజలు భక్తు లు కొలుస్తూనే మొక్కలు తీర్చుకుంటూ ముందుకు వెళుతున్నారు.గ్రామస్తులు రుద్రాక్ష మాల అభిషేకం,పట్టు వస్త్రాలు స్వామి వారికి అందజేశారు. పురోహితులు అభిషేకం ప్రత్యేక పూజలు ఘనంగా ఆట పాటలతో తప్పిట్ల మేళాలతో ఘనంగా నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో గ్రామా ఎంపీటీసీ కుమారుడు చలపతి, సర్పంచ్ తిరుపాలు,కస్తూరి అయ్య,సాయి,భరత్, మునేంద్ర,ముని కుమార్,శీను,పునీత్, నాని,భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.భక్తులకు,తీర్థ ప్రసాదాలు, అందజేసి. మధ్యాహ్నం అన్నదానం కార్య క్రమం చేపట్టారు. సాయంత్రం తపిట్లా మేళాల, టపాసుల నడుమ కార్యక్రమం లు నిర్వహిస్తూ మహా శివరాత్రి జాగారంలో పంచాక్షరీ(ఓం నమశ్శివాయ) నిత్య పూజ లు నిర్వహిస్తారు. గ్రామస్తులు స్వామి వారి ని దర్శించు కుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు.



### ఓ వైపు రాజీనామాలు...

## మరో వైపు ఒత్తిళ్లు

కడప, : నేతల వరుస రాజీనామాలు ఓవైపు టెన్షన్ పెడుతుంటే.. ఉన్న నాయకుల్లో ఆధిపత్య పోరు వైసీపీని మరింత కార్నర్ అయ్యేలా చేస్తోంది. మిగతా చోట్ల ఎలా ఉన్నా? జగన్ సొంత జిల్లాలోనే ఫ్యాన్ రెక్కలు చప్పుడు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. లీడర్లను కాపాడుకోవడానికి జగన్..చాలా కష్టపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది.జమ్మలమడుగులో కీలక నేతలు ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ పార్టీని డైలమాలో పడేస్తున్నారట. జమ్మలమడుగు రగడకు చెక్ పెట్టకపోతే ఉన్న పార్టీ కేడర్ జారుకునే పరిస్థితి కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మధ్య.. జమ్మలమడుగు జగడం నడుస్తోంది. జగన్ ఎన్నిసార్లు సర్దిచెప్పినా.. పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోందనే గుసగుసలు వినిపిస్తున్నాయ్.ఆ మధ్య సుధీర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి మధ్య సయోధ్య కుదిర్చిన జగన్.. జమ్మలమడుగులో చెరో మూడు మండలాలు చూసుకోమని చెప్పి పంపించారు. ఎవరికి కేటాయించిన మండలాల్లో.. అప్పటి నుంచి వాళ్లు కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్నారు. ఐతే కొద్దిరోజుల పాటు అంతా బాగానే ఉంది.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036